
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ၊ 22 ၊ ఆగస్టు ၊ 2025



సోమశిలలో 53.88 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 53.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 31,486 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,02,150
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,230
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,507
నవర (8 గ్రాములు)	రూ.76,056

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.3 /28.0

జిల్లాలో ఎండ తీవ్రత శుక్రవారం అధికంగా ఉంటుందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 53 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక నేడు

సంగం: జూనియర్స్ బాలబాలికల షూటింగ్ బాల్ క్రీడాకారులను సంగంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఎంపిక చేయనున్నామని షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006, మే ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని, ఆధార్‌కార్డు, పదో తరగతి మార్క్ లిస్ట్, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 94903 20435, 85558 18911 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

26 వరకు డిగ్రీ అడ్మిషన్లు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లను ఈ నెల 26 వరకు నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బీఎస్సీ సైన్స్‌లో 12.. బీఏలో ఐదు.. బీకాంలో నాలుగు కోర్సులున్నాయని చెప్పారు. కళాశాలలో హాస్టల్ సౌకర్యం ఉందని, అడ్మిషన్ల కోసం 86397 34668 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సబ్ జూనియర్స్ అండర్ – 15 రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలను నగరంలో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం ప్రారంభించారు. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లను తొలి రోజు నిర్వహించారు. 13 జిల్లాల నుంచి వచ్చిన 283 జట్లు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు తలపడనున్నాయని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కావలి (జలదంకి): బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కావలి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కావలి డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా అధికారులకు వెంటనే సమాచారమివ్వాలని కోరారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారి సురేష్, కావలి డీఎస్పీ శ్రీధర్, కమిషనర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన రేపు

నెల్లూరు(క్రైమ్): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన జిల్లా అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను శనివారం నిర్వహించనున్నామని ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌కు హాజరుకావాలని కోరారు. దరఖాస్తు సమయంలో జతపర్చిన ధ్రువీకరణ పత్రాలు, గెజిటెడ్ అధికారుల అటెస్టేషన్‌తో కూడిన ఒరిజినల్స్‌ను తీసుకురావాలని సూచించారు. ఇటీవల తీయించుకున్న ఆరు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు, హాజరైన అభ్యర్థి అటెస్టేషన్ ఫారంలో పూర్తి వివరాలను పొందుపర్చి, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేయించుకోవాలని కోరారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి



మాట్లాడుతున్న సత్యవాణి

కోవూరు: ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించేలా గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ – క్రాప్ బుకింగ్‌లో కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ముందంజలో ఉందని తెలిపారు. అగ్రిస్టాక్ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. జిల్లాలో 1400 హెక్టార్లలో ఆయిల్ ఫామ్స్ చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఉద్యాన శాఖ అధికారి అనూరాధ, వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత, ఉద్యానాధికారి ప్రసన్న, మండల వ్యవసాయాధికారులు రజని, విజయలక్ష్మి, శ్రీహరి, శశిధర్, మేరీ కమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న పరుచూరి సుబ్బయ్య.. తోటపల్లిగూడూరు దళితకాలనీలో నివాసముంటున్నారు. చిన్నతనంలో కుడి కన్ను పూర్తిగా దెబ్బతినడంతో చూపు కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఆర్థిక ఇబ్బందుల నడుమ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 20 ఏళ్ల క్రితం ఈయనకు దివ్యాంగ పింఛన్‌ను మంజూరు చేశారు. ఈ మొత్తంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయనకు ప్రభుత్వం షాకిచ్చింది. వైకల్య శాతం తగ్గిందని, పింఛన్‌ను తొలగిస్తున్నామని, సెప్టెంబర్ నుంచి రాదంటూ పంచాయతీ అధికారులు నోటీస్‌ను ఇటీవల అందజేశారు. దీంతో నోటీస్‌ను పట్టుకొని మండల కార్యాలయానికి వెళ్లి తన బాధను వారితో వ్యక్తపర్చారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువతి చాముండేశ్వరి.. కలిగిరి మండలం నరసారెడ్డిపాలెం గ్రామ వాసి. వయస్సు 30 ఏళ్లు. మానసికంగా, శారీరకంగా ఎదుగుదల లేకపోవడంతో రూ.ఆరు వేల దివ్యాంగ పింఛన్ వస్తోంది. తాజాగా దీనికి అనర్హులని, వచ్చే నెల నుంచి నిలిపేస్తున్నామంటూ నోటీస్‌ను అధికారులు జారీ చేశారు. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సెలవిచ్చారు. ప్రభుత్వ తీరుపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పోలియోతో కలువాయికి చెందిన మల్లు పెంచలరెడ్డి మంచానికే పరిమితమయ్యారు. ఇద్దరి సాయంతో ఆయన్ను కూర్చోబెట్టాలి. దివ్యాంగుల పింఛన్‌ను 20 ఏళ్లుగా పొందుతున్నారు. అయితే ప్రస్తుతం ఈయన్ను అనర్హుడిగా ప్రకటించి ఉన్న ఆసరానూ తొలగించారు.



పెన్నబద్దేవోలుకు చెందిన రాంబాబుకు రెండు కళ్లు కనపడవు. ఇదే అంశమై సదరంలో సర్టిఫికెట్‌ను డాక్టర్లు గతంలో ఇచ్చారు. దివ్యాంగుల పింఛన్‌ను పొందుతుండగా, ప్రస్తుతం 40 శాతం అంధత్వమే ఉందంటూ తొలగించారు. జిల్లాలో ఇలాంటి ఉదంతాలు కోకొల్లలు.

దివ్యాంగులను ఏడిపిం'ఛీ'న్

దివ్యాంగులపై కూటమి ప్రభుత్వానికి కనికరం కరువైంది. అనర్హత పేరుతో పింఛన్లకు కోత విధిస్తూ పైశాచికానందాన్ని పొందుతోంది. వేలాది మందికి వీటిని దూరం చేస్తూ.. ఆసరా లేకుండా చేస్తోంది. సరికొత్త నిబంధనలను తెరపైకి తెస్తూ కొర్రీలు పెడుతోంది. తమ నోటి కాడ కూడును లాగేసుకునేందుకే సర్కార్ ఈ విధంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. పింఛన్లను భారీగా తగ్గించేందుకే ఈ రకమైన కుట్రలకు పాల్పడుతోందనే విమర్శలూ లేకపోలేదు.

మర్రిపాడులోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన



- పింఛన్లలో కోత విధిస్తూ కూటమి సర్కార్ కర్కశం
- 33 వేల మందికి నోటీసులు
- 4215 తొలగింపు
- మరికొన్ని బదలాయింపు



కాలు లేకపోయినా.. వైకల్యం తాత్కాలికమట..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు అశోక్‌కుమార్. వింజమూరు మండలం సాతానువారిపాలెనికి చెందిన ఈయనకు 2014కు ముందు చోటుచేసుకున్న ఓ ప్రమాదంలో కాలు పూర్తిగా దెబ్బతినింది. ఫలితంగా వైద్యులు తొలగించారు. దీంతో ఒక కాలిపై అతి కష్టంతో ఊత కర్ర సాయంతో నడుస్తూ తన పనులు మాత్రమే చేసుకోగలుగుతున్నారు. ఈ క్రమంలో 2015లో 59 శాతం వైకల్యం ఉందంటూ జిల్లా ఆస్పత్రి నుంచి సదరం సర్టిఫికెట్‌ను పొందారు. దీని ఆధారంగా నాటి నుంచి దివ్యాంగ పింఛన్‌ను పొందుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రీ వెరిఫికేషన్ పేరిట పరిశీలించి, వచ్చే నెల నుంచి రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మోకాలి వరకు ఓ కాలును తీసేసినా, అది తాత్కాలిక వైకల్యమని నోటీస్‌లో పేర్కొనడం గమనార్హం. తానెలా బతకాలంటూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలో ఇలా..

పింఛన్లు - 3.16 లక్షలు	ప్రతి నెలా అందిస్తోంది - రూ.130 కోట్లకుపైగా..
దివ్యాంగులు - 33 వేలు	

నెల్లూరు(పొగతోట): దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కక్షగట్టింది. ఏళ్ల తరబడి పొందుతున్న పింఛన్లను తొలగించి వారి నోట్లో మట్టి కొట్టింది. వేల మందికి వీటిని తొలగించి జీవనం లేకుండా చేస్తోంది. ఇప్పటికే 5826 దివ్యాంగుల పింఛన్లను తొలగించారు. వీటిలో 1611ను వృద్ధాప్య పింఛన్లుగా మార్పు చేశారు. లేవలేని స్థితిలో ఉండి హెల్త్ పింఛన్ల రూపంలో ప్రతి నెలా రూ.15 వేలను 597 మంది పొందుతుండగా, వీరందర్నీ దివ్యాంగుల పింఛన్లకు మార్చారు.

నాడలా.. నేడిలా..!

గతంలో వీరికి సర్టిఫికెట్లను మంజూరు చేసింది.. ప్రస్తుతం అనర్హులుగా తొలగించిందీ సదరం డాక్టర్లే. గతంలో నూరు శాతం వైకల్యమని ధ్రువీకరించగా, తాజాగా కూటమి సర్కార్ పరిశీలనలో అది 40 శాతానికి పడిపోయింది. ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకే ఈ రకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

వీరందరూ అనర్హులంట..

కాలు, చేయి విరిగిన వారు.. శరీరం కాలినా.. మానసిక వికలత్వం కలిగినా.. బధిరులు.. ఇతర వైకల్యం ఉన్న వారిని పింఛన్లకు అనర్హులుగా ప్రకటించారు. వీరెవర్ని కదిలించినా ఆవేదనే కనిపిస్తోంది. అనర్హుల ఏరివేత పేరిట తమకు తీవ్ర నష్టాన్ని మిగిల్చారనే వేదన వీరి నుంచి వ్యక్తమవుతోంది.

పరిశీలన వివరాలు గోప్యం

జిల్లాలో 3.16 లక్షల మంది పింఛన్లు పొందుతుండగా, వీరికి ప్రతి నెలా రూ.130 కోట్లకు పైగా అందిస్తున్నారు. ఇందులో దివ్యాంగులు 33 వేల మంది ఉండగా, వీరందరికీ నోటీసులను ప్రభుత్వం జారీ చేసింది. పరిశీలన అనంతరం వివరాలను గోప్యంగా ఉంచారు. చివరికి ప్రభుత్వం ఆదేశించడంతో అనర్హుల జాబితాను విడుదల చేశారు. పది నుంచి 20 ఏళ్లుగా పింఛన్లు పొందుతున్న వారికి మొండిచేయి చూపారు.

- సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి సుమారు 832 మంది దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ నోటీసులను జారీ చేశారు.
- ఉదయగిరి నియోజకవర్గంలో దివ్యాంగ పింఛన్లు 4672 ఉండగా, ఇందులో 996ను తొలగించారు.

మోసపోయాను



నేను పూర్తిగా దివ్యాంగుడ్ని. కుటుంబసభ్యుల సహకారంతో అన్నీ మంచంలోనే జరగాలి. అయితే చంద్రబాబును నమ్మి ఓటేసి మోసపోయా. ఏడాదిగా రూ.15 వేలు అందజేశారు. ఇటీవల పరిశీలించిన అధికారులు, రూ.15 వేలు పొందేందుకు అనర్హుడినంటూ, రూ.ఆరు వేలను ఇచ్చేలా చేశారు. జిల్లా అధికారులు న్యాయం చేయాలి.

– పెంచలయ్య, దివ్యాంగుడు, జంగాలకండ్రిక

అర్ధాంతరంగా నిలిపేస్తున్నారు



ఒక కన్ను లేకపోవడం.. మరొకటి సక్రమంగా కనిపించకపోవడంతో దివ్యాంగ పింఛన్‌ను ఇస్తున్నారు. దీన్ని నిలిపేస్తున్నామంటూ సమాచారమిచ్చారు. ఇలా కోత విధిస్తే ఎలా బతకాలి. మాపై ప్రభుత్వం కనికరం చూపి ఆదుకోవాలి.

– కోదూరు వరలక్ష్మి, ఆత్మకూరు

మూడు దశాబ్దాల పింఛన్‌ను ఆపేశారు



పుట్టినప్పటి నుంచి ఒక కన్ను లేదు. దీంతో మూడు దశాబ్దాలుగా పింఛన్ అందుతోంది. మూడేళ్లుగా రెండో కన్నూ కనిపించడంలేదు. పింఛన్ ఆధారంగానే జీవనం సాగిస్తూ మందులను కొనుగోలు చేస్తున్నా. ఇప్పుడు దీన్ని నిలిపేస్తున్నామంటూ నోటీస్‌ను ఇచ్చారు. ఎలా బతకాలో అర్థంకావడంలేదు.

– అచ్చాల ఓబులమ్మ, తూర్పుపల్లి

పుట్టుకతోనే వైకల్యం



పుట్టుకతోనే వైకల్యం ఉంది. దివ్యాంగ పింఛన్‌ను పొందుతుండగా, నోటీసులను ఇటీవల అందజేశారు. నాకు ఇచ్చిన సమయానికి ఉదయగిరి వెళ్తే డాక్టర్లు లేరు. నెల్లూరెళ్లి అర్హత నిరూపించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దివ్యాంగులను ఇలా ఇబ్బంది పెట్టడం తగదు. చిన్న కారణాలు చూపి పింఛన్లను నిలిపేయడం దారుణం.

– ఖాదర్‌బాషా, ఏరుకొల్లు, దుత్తలూరు

2010లో సర్టిఫికెట్‌ను మంజూరు చేశారు

కంటిచూపు పూర్తిగా లేదు. 2010లోనే వైకల్య సర్టిఫికెట్‌ను మంజూరు చేశారు. వంద శాతం వైకల్యంతో ఉన్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరులోని పెద్దాస్పత్రిలో వైద్య పరీక్షలు చేశారు. ఇప్పుడు తాత్కాలికమనే సర్టిఫికెట్‌ను ఇచ్చారంటూ నోటీసులను సచివాలయ సిబ్బంది జారీ చేశారు. రీ వెరిఫికేషన్ కోసం ఎంపీడీఓకు అర్జీని ఇచ్చా. వచ్చే నెల్లో పింఛన్ అందుతుందో.. లేదోననే ఆందోళనగా ఉంది.



– చిలకపాటి వెంకటేశ్వర్లు, తూర్పుబోయమడుగుల, వరికుంటపాడు మండలం

పాలనను గాలికొదిలి.. కక్షసాధింపులకే పరిమితం

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు
- అక్రమ కేసులపై డీఎస్పీకి వినతిపత్రం అందజేత



డీఎస్పీకి వినతిపత్రమిస్తున్న కారుమూరి, చిత్రంలో పర్వతరెడ్డి, కిలివేటి, నేదురుమల్లి, విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): పాలనను కూటమి ప్రభుత్వం గాలికొదిలి.. తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు ఆరోపించారు. పార్టీ నేతలపై జిల్లాలో అక్రమ కేసులు బనాయిస్తున్న విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు గానూ జిల్లా పోలీస్ కార్యాలయానికి కారుమూరితో పాటు పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటగిరి, నెల్లూరు రూరల్, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్తలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య గురువారం వచ్చారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో డీటీసీ డీఎస్పీ గిరిధర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడారు. తమ పార్టీ నేతలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఇందులో భాగంగానే అక్రమ కేసులు, అరెస్ట్‌లను కొనసాగిస్తోందని ఆరోపించారు. తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల చేపట్టిన జిల్లా పర్యటనలో పార్టీ నేతలను ఇబ్బంది పెట్టేందుకు పన్నిన కుట్రలు అందరికీ తెలిసినవేనన్నారు. ఆయన్ను కలిసేందుకు వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులపై అక్రమ కేసులను బనాయించారని మండిపడ్డారు. ప్రశాంతమైన జిల్లాలో కక్షపూరిత రాజకీయాలకు టీడీపీ పాల్పడుతోందని ధ్వజమెత్తారు.

టీడీపీ నేతల చేతుల్లో కీలుబొమ్మలు

కూటమి పెద్దలు సూచించిన తమ పార్టీ నేతల పేర్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసి జైళ్లకు పంపుతున్నారని చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. టీడీపీ నేతల చేతుల్లో పోలీస్ శాఖ కీలుబొమ్మలా మారిందని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన సందర్భంగా తమ పార్టీ నేతలపై పోలీసులు లాఠీచార్జి చేసి కిందపడేసి.. తిరిగి వారిపైనే కేసులు బనాయించడం సిగ్గుచేటని విమర్శించారు. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై హత్యాయత్నం కేసును నమోదు చేయడం దారుణమన్నారు. మాజీ మంత్రులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్ ఇలా ప్రతి ఒక్కరిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. తమపైనా ఎక్కడ కేసులు పెడతారోనని ప్రజలు భయపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, పోలీసులు తమ తీరును మార్చుకోవాలని హితవు పలికారు.

సుస్థిరాభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా అవసరమైన చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఎమ్పీఓలు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దేశ పరిస్థితులకు అనుగుణంగా సీడీజీఎస్‌ను విభజించారని, దీనికి తగిన విధంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేస్తున్నారని వెల్లడించారు. పంచాయతీల పనితీరును కేంద్ర ప్రభుత్వం అంచనా వేసేందుకు వీలుగా ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందించారని, సమాచారాన్ని ఇందులో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీని ఆధారంగా పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేయనున్నారని తెలిపారు. జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు కృషి

నెల్లూరు రూరల్: జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. పలు అంశాలపై రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం నిర్వహించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్ నుంచి కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ప్రతి శాఖకూ లక్ష్యాలను నిర్దేశించి పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ప్రజలకు సరిపడా ఇసుక నిల్వలున్నాయని, రెండు డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామకంఠం, ప్రభుత్వ భూముల బౌండరీలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని భూ సర్వే రికార్డుల ఏడీ నాగశేఖర్, డీపీఓ శ్రీధర్‌రెడ్డికి సూచించారు. విద్యుత్, ఇరిగేషన్ ఎస్ఈలు విజయన్, దేశ్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీపీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

హోమ్ మంత్రి సంతకంతోనే పెరోల్

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లా కేంద్ర కారాగారంలో జీవిత ఖైదును అనుభవిస్తున్న రౌడీషీటర్ శ్రీకాంత్‌కు హోమ్ మంత్రి సంతకంతోనే పెరోల్ లభించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శ్రీకాంత్, అతని స్నేహితురాలు అరుణ విషయమై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. అరుణతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అనారోగ్యం పేరిట ఆస్పత్రులకు శ్రీకాంత్ వచ్చి చేసిన విషయాలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. ఇదంతా ఇప్పటి కూటమి ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. శ్రీకాంత్ పెరోల్‌కు సిఫార్సు లేఖలిచ్చింది అధికార పార్టీ ఎమ్మెల్యేలని, సంతకం పెట్టి ఫైల్‌ను నడిపించింది హోం మంత్రేనని తెలిపారు. ఈ వ్యవహారాన్ని తమ పార్టీపై రుద్దేందుకు ప్రభుత్వం, ఓ వర్గం మీడియా దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. అరుణ, శ్రీకాంత్ ఎవరితో ఉన్నారనే విషయం తాజాగా వెలుగులోకి వచ్చిన ఫొటోలను చూస్తే ఇట్టే అర్థమవుతుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ

కావలి(జలదంకి): పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ, అరుంధతీయవాడ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో పిల్లల హాజరు, మెనూ, పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

క్లుప్తంగా

వీఎస్‌యూతో ఎన్‌ఐఓటీ ఎంఓయూ

వెంకటాచలం: మండలంలోని కాకుటూరులో ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)తో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఓటీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులోని ప్రధాన అంశాలు, భవిష్యత్‌లో చేపట్టబోయే పరిశోధన, శిక్షణ కార్యక్రమాల గురించి శుక్రవారం అల్లం శ్రీనివాసరావు వెల్లడిస్తారని సంబంధిత అధికారులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

- రూ.5.10 లక్షల స్వాధీనం

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని నారంపేట గ్రామ శివారు పొలాల్లో పేకాట స్థావరంపై గురువారం సాయంత్రం సీఐ ఎం.గంగాధర్, ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, అనంతసాగరం ఎస్సైలు, సిబ్బంది దాడులు చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. రెండు మోటార్‌బైక్‌లు, రూ.5,10,350ల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్సైలు ఎస్‌కే జిలానీ, పి.సాయిప్రసాద్, సైదులు, రాజేష్, సూర్యప్రకాష్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన శేషవాహనంపై వెంకయ్యస్వామి ఊరేగింపు



వెంకటాచలం: గొలగమూడిలోని భగవాన్ వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చిన శేషవాహనసేవ జరిగింది. ఉదయం స్వామికి నిత్య పూజల అనంతరం చిన శేష వాహనంపై ఆశీనులను చేసి పూలతో ఆకర్షణీయంగా అలంకరించారు. తర్వాత గ్రామోత్సవం నిర్వహించారు. దీనిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు గొలగమూడికి చేరుకున్నారు. సీహెచ్ శ్రీధర్ (నెల్లూరు), వై.నరసింహారావు (సౌత్‌రాజుపాళెం), ఎస్.సుబ్బరాజు (కుల్లూరు రాజుపాళెం), దిలీప్‌కుమార్‌రెడ్డి (నెల్లూరు) ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి గజ వాహన సేవ జరిగింది. ఈ గ్రామోత్సవం గొలగమూడిలోని అన్ని వీధుల్లో సాగింది. ఆమంచర్లకు చెందిన డీవీ నాయుడు, అరుణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

- ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం అశ్వ వాహనసేవ, రాత్రి పెద్ద శేషవాహనసేవ నిర్వహించనున్నారు.



థమ్సప్ : టేస్ట్ ది థండర్



స్ప్రైట్ తాగుతూ.. చిల్ అవుతూ..



మాజాతో మస్తు మజా

టేస్ట్ అదుర్స్

కూల్‌డ్రింక్స్‌కు డిమాండ్ ఎక్కువ. పిల్లల నుంచి పెద్దల వరకు వివిధ బ్రాండ్ల రుచిని ఆస్వాదిస్తుంటారు. నెల్లూరు సెంట్రల్ జైల్ రహదారి సమీపంలో జనం పడేసిన బాటిళ్లను వానరాలు తీసుకుని ఆఖరిబొట్టు ఆస్వాదిస్తుండగా తీసిన చిత్రాలు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

బతుకు పోరాటంలో..

కొందరికి కుటుంబం గడవాలంటే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాల్సిందే. నెల్లూరులోని స్వర్ణాల చెరువును గుర్రపుడెక్క ఆక్రమిస్తోంది. జీవన పోరాటంలో భాగంగా పలువురు అక్కడ కష్టపడుతూ చేపల వేట చేస్తుండగా తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కమిషనర్ X శానిటరీ ఇన్‌స్పెక్టర్

- మున్సిపాలిటీలో అంతర్గత పోరు
- ఇన్‌స్పెక్టర్ కొండయ్యపై కక్ష సాధింపునకు దిగిన కమిషనర్
- నాలుగు నెలలుగా జీతం రాకుండా కొర్రీలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- దళితుడైనందునే ఇలా చేస్తున్నారని బాధితుడి ఆరోపణ

కందుకూరు: కందుకూరు మున్సిపాలిటీలో కమిషనర్ కె.అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్యల మధ్య విభేదాలు బజారుకెక్కాయి. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. దళితుడినని కమిషనర్ కక్ష కట్టి వేధిస్తున్నారని, నాలుగు నెలల నుంచి విధుల్లో ఉన్నా.. లేనట్లు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు కొండయ్య ఆరోపిస్తున్నారు. ఆయన ఏమంటున్నారంటే.. 'రోజూ పారిశుధ్య కార్మికుల హాజరు కూడా తీసుకుంటున్నా. ఇంకా పట్టణంలో పారిశుధ్య పనులు కూడా చేయిస్తున్నాను. అయితే కమిషనర్ చెప్పినట్లు తలాడించడం లేదనే కారణంతో ఇబ్బందులు పెడుతున్నారు. మేనేజర్ చంద్రమౌళి రోజువారి హాజరుపట్టీలో నేను సంతకాలు చేయకుండా అడ్డుకుంటున్నారు. రిజిస్టర్ ఇచ్చే ప్రసక్తే లేదని, దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరిస్తున్నారు. విధుల్లో లేకపోతే రోజూ కార్మికుల వద్ద హాజరు ఎలా తీసుకుంటున్నా?. నా వద్ద ఉండే రిజిస్టర్‌లో సంతకాలు ఎలా చేస్తా' అని కొండయ్య ప్రశ్నిస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయం

ఇదీ వివాదం

మున్సిపాలిటీలో గతేడాది సెప్టెంబర్ నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా దారా కొండయ్య పనిచేస్తున్నారు. మే నెలలో ఆయన్ను గుడూరు మున్సిపాలిటీకి డిప్యూటేషన్ వేశారు. ఉత్తర్వులను తీసుకునేందుకు కొండయ్య నిరాకరించడంతో తన గదికి అంటించారు. అయితే డిప్యూటేషన్ తనకు తెలియకుండా వేశారని, కమిషనర్ ప్రోద్బలంతోనే ఇది జరిగిందని భావించిన హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు డిప్యూటేషన్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆయన తిరిగి కందుకూరు మున్సిపాలిటీలోనే కొనసాగించే విధంగా మున్సిపల్ శాఖ డీఎంఏ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు కమిషనర్ కూడా రీ జాయిన్ ఆర్డర్ ఇచ్చారు. కానీ ఆయన్ను శాఖాపరమైన వాట్సప్ గ్రూపుల నుంచి తొలగించారు. అలా చేయడంతో రోజూ ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం లేదని కొండయ్య చెబుతున్నారు.

ఉన్నతాధికారుల వద్ద తేల్చుకుంటా..

కమిషనర్, మేనేజర్ తీరు వల్ల ఏప్రిల్ నెల నుంచి జీతాలు రావడం లేదని, దీనిపై ఇప్పటికే మున్సిపల్ శాఖ డీఎంఏకి, ఆర్డీకి ఫిర్యాదు చేశానని కొండయ్య చెబుతున్నారు. వారు ప్రశ్నించడంతో విధుల్లో లేనట్లు రెండు రోజుల క్రితం తన చేతిలో కాగితం పెట్టారంటున్నారు. వాస్తవాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. పారిశుధ్య పనులకు సంబంధించిన వస్తువులు వంటి తాను ఇవ్వాల్సి ఉందని, కానీ సంబంధం లేకుండా అనధికారికంగా ఇంజినీరింగ్ సెక్షన్‌లో అడ్మిన్ సెక్రటరీగా పనిచేసే బాలాజీ అనే ఉద్యోగితో చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని, ఇటువంటి పనులు చేయనందుకే తనను వేధిస్తున్నారని చెప్పారు.

తీవ్ర ఇబ్బందులు



నాలుగు నెలలుగా జీతం రాకపోవడంతో కుటుంబ పరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన భార్య అనారోగ్యంతో బాధపడుతోందని, ఆమె చికిత్స కూడా డబ్బుల్లేని పరిస్థితి ఉందన్నారు. కందుకూరులో ఉంటున్న గదికి అద్దె చెల్లించకపోవడంతో ఖాళీ చేయాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం కార్మికుల హాజరు తీసుకుని భవనంలోని ఓ గదిలో ఉంటున్నట్లు వాపోయారు.

సక్రమంగా పనిచేయకుంటే సస్పెండ్ చేస్తాం

- నెల్లూరు, ప్రకాశం డీసీహెచ్‌ఎస్‌లు
- ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాల పరిశీలన
- సమయపాలన పాటించడం లేదని ఆగ్రహం

ఉలవపాడు: వైద్యులు, సిబ్బంది సక్రమంగా పనిచేయకుంటే సస్పెండ్ చేస్తామని నెల్లూరు, ప్రకాశం జిల్లాల వైద్యవిధాన పరిషత్ కో–ఆర్డినేటర్లు పరిమళ, శ్రీనివాస నాయక్ హెచ్చరించారు. ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలను గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరుపై వారు అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆగ్రహించారు. రికార్డులను పరిశీలించారు. వైద్యశాల పనితీరు ఎలా ఉందని స్థానికులు, రోగులను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితి దారుణంగా ఉందని వారు డీసీహెచ్‌ఎస్‌లకు తెలియజేశారు. 8 మంది వైద్యులున్నా అధిక శాతం మంది సెలవులోనే వెళ్లారని, కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారని తెలిపారు. సెలవులు ఒకేసారి ఇంతమందికి ఎలా ఇస్తారని అడిగారు. రోగుల పట్ల వైద్య సిబ్బంది ప్రవర్తన చాలా దారుణంగా ఉందన్నారు.

రాత్రివేళ సిబ్బంది కనిపించడం లేదు

రాత్రివేళ విధులు నిర్వహించాల్సిన సిబ్బంది వార్డులో ఉండకుండా వెళ్లి రూమ్‌లో పడుకుంటున్నారని.. వారిని లేపే సరికి దాదాపు 15 నిమిషాలు పడుతుందని రోగులు తెలియజేశారు. రాత్రి వేళల్లో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. గైనకాలజిస్ట్ లేకపోవడంతో గర్భిణులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో వైద్యాధికారులుగా శోభారాణి, సతీష్‌లు ఉన్నప్పుడు వైద్యశాల బాగుంది. తర్వాత నుంచి పరిస్థితి దారుణంగా తయారైందని పలువురు స్థానికులు తెలియజేశారు. ఇక్కడ పనిచేస్తున్న గైనకాలజిస్ట్ మెటర్నటీ లీవ్ పెట్టి వెళ్లారు.. కానీ కందుకూరులోని ప్రైవేట్ వైద్యశాలలో మాత్రం పనిచేస్తున్నట్లు తెలిపారు. వీటిపై అధికారులు డాక్టర్లను ప్రశ్నించగా వారు మౌనం వహించారు. దీంతో డీసీహెచ్‌ఎస్‌లు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇలాంటి పొరపాట్లు జరిగితే సహించేది లేదని సస్పెండ్ చేస్తామన్నారు. వారంరోజుల్లో మళ్లీ తనిఖీకి వస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఊరు కోమని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు హరీష్, చిన్నపిల్లల వైద్యనిపుణులు ప్రదీప్‌కుమార్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశాలపై స్థానికులను అడిగి తెలుసుకుంటున్న డీసీహెచ్‌ఎస్ పరిమళ

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.40
పండు	: రూ.20



నాడొకమాట.. నేడు మరోమాట

- కూటమి ప్రభుత్వంపై మండిపడిన నేతలు
- ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగలగొట్టాలని నాడు టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వాటిని ఏర్పాటు చేస్తున్నారు. నాడొకలా.. నేడు మరోలా వ్యవహరిస్తున్నారు' అని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవన్‌లో గురువారం వామపక్షాలు, పలు ప్రజాసంఘాల నాయకులు విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి, సీపీఐ ఎంఎల్ నాయకుడు రాంబాబు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రూ.15,500 కోట్ల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. ప్రజలు వ్యతిరేకిస్తే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దని విద్యుత్ శాఖ మంత్రి ఆదేశాలిచ్చినా అదానీ, విద్యుత్ సిబ్బంది దొంగచాటుగా మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో యూనిట్ విద్యుత్ ధర రూ.2.40లకు కొంటే టీడీపీ గగ్గోలు పెట్టారన్నారు. నేడు అదే యూనిట్ విద్యుత్‌ను రూ.3.60లకు కొంటున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్, చిత్రంలో నేతలు

టీడీపీకి రూ.40 కోట్లు

కరేడు గ్రామంలో షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు చెందిన ఇండోల్‌సోల్ సోలార్ కంపెనీకి 8,400 ఎకరాల భూమిని అప్పగించేందుకు వారు బాండ్స్ రూపంలో టీడీపీకి రూ.40 కోట్లు అందజేసినట్లు నేతలు ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి సింగిల్‌ఫేజ్ విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.9 వేలు, త్రీఫేజ్ వినియోగదారుల నుంచి రూ.14 వేలు వసూలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. కూటమి ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ చేసే పోరాటాలకు పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు ఇస్తున్నాయన్నారు. రాబోయే కాలంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ, సదస్సులు, సభలు నిర్వహిస్తామన్నారు. నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, ప్రసాద్, పుల్లయ్య, శ్రీరాములు, వెంకమరాజు, షానవాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మేరిగకు సజ్జల పరామర్శ



నివాళులర్పిస్తున్న రామకృష్ణారెడ్డి

రాపూరు/సైదాపురం: ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పరామర్శించారు. మేరిగ తండ్రి ఆనందరావు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మాజీ మంత్రి, జిల్లా కో–ఆర్డినేటర్ కారుమూరి వెంకటనాగేశ్వరావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆనం విజయ కుమార్‌రెడ్డి గురువారం రాపూరులోని లక్ష్మీపురంలోని మేరిగ నివాసంలో ఆనందరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దంపతులపై దాడి

కొండాపురం: ఇంట్లోకి చొరబడి భార్యాభర్తలపై కర్రలతో దాడి చేసిన ఘటన మండలంలోని నేకునాంపేట ఎస్సీ కాలనీలో గురువారం మధ్యాహ్నం జరిగింది. గ్రామస్తులు, బాధితుల కథనం మేరకు.. నల్లకంట్ల సలోమాన్ – భార్య సునీత దంపతులు ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన నల్లకంట్ల ఆశీర్వాదం, కోటమ్మ, సంతోష్, అంకిత్‌లు మరో 8 మందితో కలిసి వెళ్లి దాడికి పాల్పడ్డారు. సలోమాన్ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. గతంలో స్వల్ప గొడవలున్న కారణంగానే కడతేర్చాలని దాడులకు పాల్పడినట్లు బాధితులు తెలిపారు.

'మాకు అన్యాయం చేస్తున్నారు'

- కలెక్టర్‌కు తెలిపిన నర్సులు

నెల్లూరు(అర్బన్): నాలుగు రోజుల క్రితం పెద్దాస్పత్రిలోని మేల్ నర్సు వెంకటప్పయ్యపై పీజీ, పలువురు ఇంటర్న్‌షిప్ డాక్టర్లు దాడి చేసిన ఘటనలో తమకు అన్యాయం చేస్తూ పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు స్టాఫ్ నర్సులు కలెక్టర్ ఆనంద్‌కు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నర్సులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నర్సులు ఆయనతో మాట్లాడుతూ దాడి ఘటనపై విచారణ జరిపేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి కమిటీని వేశారన్నారు. అయితే అందులో పదిమంది డాక్టర్లున్నారన్నారు. తమవైపు నుంచి కేవలం ఇద్దరు నర్సులను మాత్రమే తీసుకున్నారన్నారు. డాక్టర్ల వాయిస్ ముందు తాము ఎలా వాదించగలమన్నారు. అంతేకాకుండా ఆస్పత్రిలో డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న మహేశ్వరరెడ్డి గానీ, ఏడీ, ఇతర అధికారులను కమిటీలోకి తీసుకోలేదని తెలిపారు. దీంతో స్పందించిన ఆనంద్ మాట్లాడుతూ విచారణ కమిటీలో ఎంతమంది డాక్టర్లుంటే అంతమంది నర్సులను తీసుకునేలా.. అలాగే విచారణ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగేలా ఆదేశాలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శాంతి, స్పందన, లక్ష్మి తదితర పలువురు నర్సులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక..

- మహిళ బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): సహజీవనం చేస్తున్న వ్యక్తి వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం వైఎస్సార్ నగర్‌కు చెందిన వెంకట సుబ్బారావు, శివలక్ష్మి (34) దంపతులకు యక్షిత సంతానం. విభేదాల నేపథ్యంలో ఏడు సంవత్సరాల క్రితం వెంకటసుబ్బారావు భార్యను వదిలి వెళ్లిపోయాడు. అప్పటినుంచి శివలక్ష్మి తన కుమార్తెతో ఉంటోంది. నెల్లూరు కేంద్ర కారాగారంలో వార్డన్‌గా పనిచేస్తున్న ఎం.శివకుమార్‌కు నాలుగు సంవత్సరాల క్రితం శివలక్ష్మితో పరిచయమైంది. బాగా చూసుకుంటానని నమ్మించి అతను ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. వారికి ప్రస్తుతం పదినెలల వయసున్న బాబు ఉన్నాడు. కొద్దినెలలుగా శివకుమార్ వారిని పట్టించుకోకపోవడంతో శివలక్ష్మి ఇటీవల నిలదీసింది. దీంతో తనకు భార్య, పిల్లలున్నారని, మిమ్మల్ని పోషించలేనని ఆమెను కొట్టడం, తిట్టడం ప్రారంభించారు. బుధవారం రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శివలక్ష్మి తన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకుంది. కుమార్తె వెళ్లి తలుపు తట్టినా ఆమె తీయలేదు. శివకుమార్ సైతం పట్టించుకోలేదు. బెడ్‌రూమ్ నుంచి ఎక్కిళ్ల శబ్దం వస్తోందని యక్షిత శివకుమార్‌కు చెప్పింది. ఇద్దరూ కలిసి తలుపులు బలంగా నెట్టడంతో తెరుచుకున్నాయి. శివలక్ష్మి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉండటంతో కిందకు దించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. యక్షిత వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



శశికుమార్ మృతదేహం

కోవూరు: కోవూరులోని కొత్తూరు ప్రాంతానికి చెందిన కె.శశికుమార్ (45) ఆర్థిక సమస్యలతో గురువారం పొలాల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. శశికుమార్ ఆటో నడుపుతుంటాడు. కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో తట్టుకోలేక మద్యంలో విషం కలిపి తాగాడు. పొలాల్లో ఉన్న రైతులు అతడిని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ రషీద్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు. శశికుమార్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.108	స్కిన్‌లెస్ చికెన్ :	
లేయర్	: రూ.118	రూ.224	
బ్రాయిలర్ చికెన్	: రూ.200	లేయర్ చికెన్	: రూ.200

'మా పొట్ట కొట్టొద్దు'

సోమశిల: కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల పొట్ట కొట్టిందని నేతలు అన్నారు. అనంతసాగరం మండల కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఆటో కార్మికుల సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. అనంతరం బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి రాజా మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోల్లో ప్రయాణించే వారు తగ్గిపోయారన్నారు. కార్మికులు కుటుంబాలను ఏ విధంగా పోషించాలని ప్రశ్నించారు. వాహనమిత్ర ద్వారా ప్రతి ఆటో కార్మికుడికి సంవత్సరానికి రూ.25,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లోకేశ్ పాదయాత్ర సమయంలో ఆటో కార్మికులతో నడిచి కూటమి ప్రభుత్వం రాగానే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారని, ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. పాత పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇవ్వాలన్నారు. ఆ సంఘం గౌరవాధ్యక్షుడిగా అన్వర్‌బాషా, అధ్యక్షుడిగా నాయబ్ జానీ, కార్యదర్శిగా మస్తాన్ నియమితులయ్యారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

చుక్కలదుప్పిని రక్షించిన ఆర్టీసీ సిబ్బంది



ఉదయగిరి రూరల్: దాహం తీర్చుకునేందుకు అటవీ ప్రాంతం నుంచి పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కోన కాలువ వద్దకు గురువారం చుక్కలదుప్పి వచ్చింది. కుక్కలు దానిని తరుముకోవడంతో ఆర్టీసీ డిపోలోని గ్యారేజీలోకి వెళ్లింది. సిబ్బంది గుర్తించి దుప్పిని రక్షించి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. ఏబీఓ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో డిపోలోకి చేరుకుని దుప్పిని స్వాధీనం చేసుకొని దుర్గంపల్లె అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.